క్లుప్తంగా

వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం


వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసిన నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: ఎన్నికల కోడ్ ముగిసినప్పటికీ అధికారులు బొమ్మూరు సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి ముసుగు తొలగించలేదు. దీంతో వైఎస్సార్ సీపీ యువ నాయకులు అప్పా రాజీవ్‌కుమార్(బాబి), తోడేటి రాహుల్ మిత్ర బృందం ఆధ్వర్యంలో ఆదివారం వైఎస్సార్ విగ్రహానికి ముసుగు తొలగించి, క్షీరాభిషేకం చేశారు. అనంతరం దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అప్పాబాబీ, రాహుల్ మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బొమ్మూరు దళిత నాయకులు జాల కృపారావు, సుధీర్, శ్రీకాంత్, వినిత్, అఖిల్, టోనీ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రాథమిక ఓటర్ల జాబితా ప్రదర్శన

రాజమహేంద్రవరం సిటీ: ది ఆర్యాపురం కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు పాలకవర్గం ఎన్నికలు ఈ నెల 20న జరగనున్న దృష్ట్యా 17వ తేదీ సోమవారం బ్యాంక్ ప్రాథమిక ఓటర్ల జాబితా ప్రదర్శించనున్నట్టు బ్యాంక్ ముఖ్య కార్యదర్శి కె.స్వరాజ్యలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకు బ్రాంచీల్లో ఏర్పాటు చేసిన ప్రాథమిక ఓటర్ల జాబితాలో సభ్యులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే, ఈ నెల 24లోగా సంబంధిత బ్రాంచి మేనేజర్ ద్వారా బ్యాంకు ముఖ్య కార్యదర్శికి లిఖితపూర్వకంగా తెలపాలన్నారు. గడువులోగా ఏ విధమైన లిఖితపూర్వక అభ్యంతరాలు రాకపోతే, తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తామన్నారు.

ఎమ్మెల్యే గోరంట్లను కలిసిన మంత్రి దుర్గేష్


మంత్రి దుర్గేష్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆదివారం రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్‌ను గోరంట్ల సాదరంగా ఆహ్వానించారు. మంత్రి పదవి చేపట్టినందుకు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి, భవిష్యత్తులో మరిన్ని పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. అదేవిధంగా మంత్రి దుర్గేష్ కూడా గోరంట్లను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛమిచ్చి అభినందనలు తెలిపారు. అనంతరం గోరంట్ల ఇచ్చిన తేనేటి విందును కందుల స్వీకరించారు. గోరంట్ల కుమార్తె కంఠమనేని శిరీష, మాజీ డిప్యూటీ మేయర్ వాసిరెడ్డి రాంబాబు తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


కడియపులంక హైస్కూలు పూర్వ విద్యార్థులు

కడియం: కడియపులంక హైస్కూల్‌లో 1989–90 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పీఎస్ఎం ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. సమాజంలో వివిధ స్థాయిల్లో స్థిరపడ్డ వారంతా మరోసారి తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ముందుగా స్కూల్‌లో తాము చదువుకున్న తరగతి గదుల్లో ఉపాధ్యాయులతో కలిసి సందర్శించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు టీఎస్‌కే దుర్గాప్రసాద్, కె.వెంకట్రావు, ఎస్ దైవఆశీర్వాదం, పీవీ నాగరత్నంను ఘనంగా సత్కరించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా రూ.70 వేల విలువైన సౌండ్ సిస్టం, 40 కుర్చీలను పాఠశాలకు అందజేశారు.

మహనీయుడు చింతా

బిక్కవోలు: అనేక మందికి ఉపాధి కల్పించిన మహనీయుడు పారిశ్రామిక వేత్త చింతా పాండురంగారెడ్డి అని రాష్ట్ర కోళ్ల రైతుల సంఘ అధ్యక్షుడు కర్రి వెంకట ముకుందరెడ్డి కొనియాడారు. ఆదివారం బలభద్రపురం గ్రామంలోని ఆంధ్రా షిర్డీసాయి ఆలయం వద్ద చింతా పాండురంగారెడ్డి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ ఇటీవల కొమరిపాలెం గ్రామానికి చెందిన చింతా పాండురంగారెడ్డి అకాల మృతి చెందడం బాధాకరమన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

- నేటి ఈద్ ఉల్ అద్హా పండగకు భారీ ఏర్పాట్లు
- ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్న ముస్లింలు
- సర్వ మానవాళి కోసం దువా చేయనున్న మత పెద్దలు
- ఈద్గాలతో పాటు మసీదుల్లోనూ సన్నాహాలు


ఈద్గాలో నమాజ్ చేస్తున్న ముస్లింలు (ఫైల్)

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ముస్లింలకు పవిత్రమైన, త్యాగానికి ప్రతీకైన బక్రీద్ (ఈద్ ఉల్ అద్హా)పండగను జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నెల 17న(సోమవారం) పండగకు ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు ముస్లింలు ఏర్పాట్లు చేసుకున్నారు. ఈద్గాలతో పాటు, మసీదుల్లోనూ ప్రత్యేక నమాజ్ కోసం సన్నాహాలు చేశారు. పండగ రోజు ఉదయమే కొత్త దుస్తులు ధరించి, ఈద్ నమాజ్ చదివేందుకు ఈద్గాల వైపు బయలుదేరుతారు. అల్లాహు అక్బర్.. అల్లాహు అక్బర్.. లా ఇలాహ ఇల్లల్లాహు, అల్లాహు అక్బర్.. అల్లాహు అక్బర్ వలిల్లాహిల్ హంద్.. అంటూ తక్బీర్ చదువుతూ ఈద్గాలకు చేరుకుంటారు. ఈద్గాలకు వెళ్లలేని వారు సమీపంలోని మసీదులకు వెళ్లి, ఈద్ నమాజు చేస్తారు. ఈద్గా, మసీదుల్లో నమాజు చేయించే ఇమామ్‌లు, మౌల్వీలు తమ ఆధ్యాత్మిక ప్రసంగం, నమాజు అనంతరం ప్రత్యేక దువా చేస్తారు. సర్వమానవాళి సంక్షేమం, ప్రపంచ శాంతి కోసం, సకల పాపాల విముక్తి కోసం అల్లాహ్‌ను వేడుకుంటారు. నమాజు, దువా అనంతరం ఒకరికొకరు ఈద్ ముబారక్ చెప్పుకొంటూ, కరచాలనం, ఆలింగనం చేసుకుంటారు. బక్రీద్ సందర్భంగా అనేక మంది ఉపవాసాలు(రోజా) ఉంటారు. దీనికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఇందుకు లభించే పుణ్యం కోసం ఈద్‌కు ఒకరోజు ముందు కూడా ఉపవాసం పాటిస్తారు. ఇంకొందరు పండగ రోజు ఈద్ నమాజు, ఖుర్బానీ పూర్తయ్యే వరకూ ఏమీ భుజించకుండా వెళ్లి ప్రార్థనలు చేస్తారు. పండగ శుభాలు జరగాలని కోరుకుంటారు. ఆధ్యాత్మికంగా జరిగే పండగ నమాజ్‌లో పాల్గొనేందుకు తరలి వచ్చే ముస్లింలతో ఈద్గాలు, మసీదులు కళకళలాడనున్నాయి.

బక్రీద్ నేపథ్యమిదీ..

ప్రవక్తలు ఇబ్రహీం ఖలీలుల్లా, ఇస్మాయిల్ జబీవుల్లా త్యాగాలకు ప్రతీకగా బక్రీద్ పండగ చేసుకుంటారు. ఇదే రోజు పవిత్ర పుణ్యక్షేత్రం మక్కాలో హజ్ జరుగుతుంది. మక్కాలోని కాబా సమీపంలో ఉన్న అరాఫత్ మైదానంలో ఉన్న పెద్ద మసీదులో బక్రీద్ నమాజ్ చేయడంతో పాటు, పలు నియమ నిబంధనలతో ప్రార్థనలు చేశాకే హజ్ సంపూర్ణమవుతుంది. అల్లాహ్ ఆదేశించిన ఇస్లాం ధర్మ సూత్రాల్లో ఇది కీలకమైనది. తమ జీవితంలో పాటించాల్సిన పంచ నియమాలను పవిత్ర గ్రంథం ఖురాన్‌లో అల్లాహ్ స్పష్టం చేశారు. అవే ఈమాన్, రోజుకు ఐదు పూటల నమాజ్, రోజా, జకాత్, హజ్. ఆర్థిక స్థోమత ఉన్న ప్రతి ముస్లిం జీవితంలో ఒక్కసారైనా హజ్ చేయాలని ఆదేశించారు. ఇది 40 రోజుల పాటు కొనసాగే కఠినమైన యాత్ర.

ఈద్గాలు, మసీదుల్లో ఏర్పాట్లు

రాజమహేంద్రవరంలో రాయల్ మాస్క్, జామా మసీదు, అబూబకర్ షా మసీద్, బిలాల్ మసీద్, జాంపేట లబాబిస్ లైన్ మసీదు, దానవాయిపేట మదీనా మసీదుతో పాటు పలు ఈద్గాల్లో ఈద్ నమాజ్ నిర్వహించేందుకు ఆయా కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా కులమతాలకు అతీతంగా ముస్లింలకు పండగ శుభాకాంక్షలు తెలిపి మతసామరస్యాన్ని చాటుకుంటారు.


ఈద్ ముబారక్ చెప్పుకొంటున్న పిల్లలు (ఫైల్)

దాన, సేవ గుణాలను అలవరుస్తోంది



పేద, ధనిక వర్గాల మధ్య తారతమ్యాలను బక్రీద్ పండగ చెరిపేస్తుంది. ప్రతిఒక్కరిలో సేవ, దాన గుణాలను అలవర్చుతోంది. త్యాగానికి ప్రతీకగా నిలిచే ఈ పండగ శాంతి, సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తుంది.

– ఎండీ అమీర్‌పాషా, రాజమహేంద్రవరం

కళ్లెదుటే కలలు తీర్చేది నాన్న


గాడ్ ఫాదర్ పురస్కారాలతో సత్కరిస్తున్న ప్రముఖులు

రాజమహేంద్రవరం సిటీ: భగవంతుడు కోర్కెలు తీర్చటం మాటేలా ఉన్నా, కళ్లెదుటే కన్నవారి కలలు తీర్చేది మాత్రం నాన్నే అని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం ఫాదర్స్ డే సందర్భంగా సహాయ్ సంస్థ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో గాడ్ ఫాదర్ పురస్కారాల ప్రదానం జరిగింది. ఆంధ్రకేసరి యువజన సమితి అధ్యక్షులు దేశిరెడ్డి బలరామనాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సమాజ సేవకులు కేకే సంజీవరావు, విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు ఈవని యజ్ఞ సూర్యనారాయణశర్మ, సీనియర్ సిటిజన్ వైవీ జగన్నాథరావుకు పురస్కారాలు అందజేశారు. విశిష్ట అతిథులుగా హాజరైన మైలవరపు నాగేంద్రప్రసాద్, అసదుల్లా అహ్మద్, దూర్వాసుల సత్యనారాయణ, క్రొవ్విడి సుబ్రహ్మణ్యం సత్కరించారు. సమాజంలో తండ్రి పాత్ర వెలకట్టలేనిదని, ఆ నాన్నకు లేఖ పోటీలో ముగ్గురు విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు పీవీఎస్ కృష్ణారావు, మాదిరాజు శ్రీనివాస్, కొత్తపల్లి భాస్కరరామం, సూర్యకుమారి, యేచూరి శ్రీరామచంద్రమూర్తి, ప్రసన్న, రెండుచింతల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యునికి ప్రత్యేక పూజలు

పెదపూడి: నిత్యం భక్తులతో పూజలందుకుంటున్న జి.మామిడాడ గ్రామంలో ప్రసిద్ధి చెందిన ఉష, ఛాయ, పద్మ, సౌంజ్ఞ సమేత సూర్యనారాయణ మూర్తి ఆలయంలో ఆదిత్యునికి ఆదివారం ప్రత్యేక పంచామృతాభిషేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు స్వామివారికి ఉదయం విశేష వ్రత పూజలు చేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో కుర్చున్నారు. స్వామి వారిని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆయన భార్య మహాలక్ష్మి దంపతులు దర్శించుకున్నారు.

గుమ్ములూరు హైస్కూల్‌కు మొక్కల వితరణ


గుమ్ములూరు హైస్కూల్‌కు మొక్కలు అందజేస్తున్న ప్రతినిధులు

మధురపూడి: కోరుకొండ మండలం గుమ్ములూరు జెడ్పీ హైస్కూల్‌కు ఆదివారం రాజమహేంద్రవరానికి చెందిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రతినిధులు మొక్కలు పంపిణీ చేశారు. గో గ్రీన్ కార్యక్రమంలో భాగంగా 50 మొక్కలను వారు స్కూలు ఆవరణలో నాటారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారి రూపేష్ మాట్లాడుతూ మొక్కలు మానవ వికాసానికి దోహదపడతాయన్నారు. ప్రాణ వాయువును ఇవ్వడం ద్వారానే ప్రశాంత వాతావరణం ఏర్పడుతోందన్నారు. వీటితో రేపటితరం మానసికోల్లాసంతో పాటు, ఆరోగ్యాన్ని పొందుతుందన్నారు. గ్లోబల్ వార్మింగ్‌ను తగ్గించడంలో తమవంతు కృషిగా మొక్కలను అందిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది జగదీష్, రామకృష్ణ, రంగబాబు, స్కూల్ హెచ్‌ఎం గంగాభవాని, టీచర్లు నాగేశ్వరరావు, జాకబ్‌రాజు పాల్గొన్నారు.

ఘనంగా పునీత ఆంథోనీ మహోత్సవం


కోరుకొండ ఆర్‌సీఎం చర్చిలో సందేశమిస్తున్న ఫాదర్ మాణిక్యం

మధురపూడి: మండల కేంద్రమైన కోరుకొండ ఎస్సార్‌నగర్‌లోని ఆర్‌సీఎం చర్చిలో ఆదివా రం సాయంత్రం పునీత ఆంథోనీ మహోత్సవం జరిగింది. రెవరెండ్ ఫాదర్ మాణిక్యం వాక్యసందేశమిచ్చారు. క్రీస్తు వాక్యాన్ని విశ్వవ్యాప్తి చేయడంలో పునీత ఆంథోనీ కృషి అమితమైందన్నారు. భక్తి, నిరాడంబరత, త్యాగం ఆయన ఔన్నత్యమన్నారు. క్రైస్తవులందరూ పునీత ఆంథోనీని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా సహపంక్తి భోజనాలు చేశారు.

మందుల దుకాణాలపై నిఘా

- కాసి సాఫ్ట్‌వేర్ అప్లికేషన్‌తో ర్యాండమ్ తనిఖీలు
- అప్రమత్తంగా ఉండాలంటున్న డ్రగ్స్ అధికారులు


మందుల దుకాణంలో తనిఖీ చేస్తున్న డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు

కంబాలచెరువు: నగరంలోని మందుల దుకాణాలపై ఔషధ నియంత్రణ శాఖ అధికారులు నిఘా పెట్టారు కొన్ని దుకాణాల్లో ఇటీవల వస్తున్న మందుల అమ్మకాలు, ఔషధాల వినియోగంపై పలు సంఘటనలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో ఆ దిశగా చర్యలు చేపడుతున్నారు. నగరంలో వెయ్యికి పైగా మందుల దుకాణాలు ఉన్నాయి. వీటి ద్వారా నిత్యం వేల సంఖ్యలో వినియోగదారులు మందులు కొనుగోలు చేస్తుంటారు. వీటి అమ్మకాల్లో కొందరు వ్యాపారులు చేతివాటం చూపుతున్నారు. వారిలో ఇటీవల మార్కెట్‌లోకి వచ్చిన కొన్ని కార్పొరేట్ మందుల దుకాణాల పేర్లు వినిపిస్తున్నాయి. దీనిపై కొద్దిరోజుల క్రితం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. ఇదే విధంగా పలు దుకాణాలు అదే ధోరణిలో నడుచుకుంటున్నాయని వచ్చిన వార్తలతో ఔషధ నియంత్రణ శాఖ అధికారులు నగరంలోని అన్ని మందుల దుకాణాలను వరుసగా తనిఖీలు చేస్తున్నారు. ఏ ఒక్క దుకాణం తనిఖీ లేకుండా ఉండకూడదనే నిశ్చయంతో ఆన్‌లైన్ యాప్ ద్వారా తనిఖీలు నిర్వహిస్తున్నారు. దుకాణ తనిఖీల్లో పట్టుబడితే కఠిన చర్యలు దిశగా ముందుకు వెళుతున్నారు. ప్రతి వినియోగదారునికి బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలని, మందులు అమ్మే సమయంలో కచ్చితంగా టాబ్లెట్‌పై ఎక్స్‌పైర్(గడువు) తేదీ చూసుకుని అమ్మాలని సూచిస్తున్నారు. అలాగే హెచ్‌వన్ డ్రగ్స్ అమ్మకాల్లో జాగ్రత్త వహించాలని, వైద్యుని చీటీ మేరకే వాటిని విక్రయించాలని ఆదేశాలిస్తున్నారు.

అధికారుల ర్యాండమ్ తనిఖీలు

ఔషధ నియంత్రణ శాఖాధికారులు ఒకే దుకాణాన్ని, ఒకే ప్రాంతంలో ముందుల షాపులను తనిఖీ చేయకుండా, ప్రతి ఒక్క దుకాణాన్నీ తనిఖీ చేసే విధంగా కంప్యూటర్ ఎయిడెడ్ సెలక్షన్ ఆఫ్ ఇన్‌స్పెక్షన్ సాఫ్ట్‌వేర్ అప్లికేషన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. దీని ద్వారా నగరంలోని ప్రతి మందుల దుకాణం తప్పనిసరిగా తనిఖీ జరగాలి. దాని ద్వారా అర్బన్‌లో మందుల దుకాణాలను కంప్యూటర్ ఆధారితంగా తనిఖీలు చేస్తున్నారు. ఒకవేళ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఆ దుకాణాన్ని తాత్కాలికంగా పక్కకు పెట్టినా, మూడు రోజుల తర్వాత కంప్యూటర్ స్కిప్ చేసిన మందుల దుకాణం పేరును ఇస్తూనే ఉంటుంది. దీంతో ఏ ఒక్క మందుల దుకాణం తనిఖీ చేయకుండా ఉండేందుకు వీలు లేదు.

నిబంధనలు పాటించండి



రోగికి మందులే ప్రాణాధారం. వాటిని అమ్మే విషయంలో దుకాణదారులు చాలా అప్రమత్తంగా వ్యవహరించాలి. అర్బన్ పరిధిలో ఉన్న ప్రతి మందుల దుకాణం ప్రభుత్వ ఆదేశాల మేరకు తనిఖీ చేయబడుతుంది. ఈ నేపథ్యంలో నిత్యం తమ మందుల దుకాణాన్ని అన్ని విధాలా పూర్తి నిబంధనలకు అనుగుణంగా ఉంచుకోవాలి. తనిఖీల్లో పట్టుబడితే చట్టపరమైన శిక్షలకు బాధ్యులు అవుతారు. మందుల కొనుగోలులో తేడా వస్తే, వెంటనే మాకు ఫిర్యాదు చేస్తే చర్యలు చేపడతాం.

– కృష్ణ, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్, రాజమహేంద్రవరం

జోరందుకున్న నేరేడు అమ్మకాలు


కోరుకొండలో బండిపై విక్రయిస్తున్న నేరేడు పండ్లు

మధురపూడి: ఆరోగ్య ప్రదాయిని నేరేడు పండ్ల అమ్మకాలు కోరుకొండలో జోరుగా సాగుతున్నాయి. కేజీ ధర సైజును బట్టి రూ.120 నుంచి రూ.200 వరకూ అమ్ముతున్నారు. మండలంలోని నర్సాపురం, గాదరాడ, కణుపూరు. దోసకాయలపల్లి, నిడిగట్ల, బూరుగుపూడి, మధురపూడి, గుమ్ములూరు గ్రామాల్లో వీటి ఉత్పత్తి అధికంగా ఉంది. వర్షాలు ఆలస్యం కావడంతో వీటి అమ్మకాలు ఎక్కువగా జరుగుతున్నాయి.

సినిమాలు

శ్యామల:	హరోంహర
సూర్యమినీ:	చందు ఛాంపియన్
సూర్యప్యాలెస్:	హరోంహర
స్వామి:	మహారాజ
శివజ్యోతి:	యేవమ్, సత్యభామ
అనుశ్రీ:	మనమే
రాజా:	బ్యాడ్‌బాయ్స్
ఊర్వశి:	రాజధాని రౌడీ
రంభ:	ఇంద్రాణి
మేనక:	సత్యభామ
అప్సర:	గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
కుమారి:	మ్యూజిక్ షాప్ మూర్తి
నామవరం:	
వీఎస్.మహల్:	హరోంహర
ధవళేశ్వరం:	
మురళీకృష్ణ:	మ్యూజిక్ షాప్ మూర్తి
కడియం:	
వెంకటసూర్య:	హరోంహర

ఘనంగా వీరభద్రస్వామి కల్యాణం

పెదపూడి: పుట్టకొండ గ్రామంలో ప్రసిద్ధి చెందిన భద్రకాళీ సమేత వీరభద్రస్వామి వారి కల్యాణం ఆదివారం ఉదయం ఘనంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు పున్నమరాజు కమలాకర్ అధ్వర్యంలో వేద పండితులు కల్యాణ క్రతువు నిర్వహించారు. కల్యాణం సందర్భంగా ఉదయం నుంచి స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు చేశారు. పది గంటలకు కల్యాణ ఘట్టం ప్రారంభమైంది. మధ్యాహ్నం 12 గంటలకు జీలకర్ర, బెల్లం సుమూర్తంతో కల్యాణ తంతు పూర్తి చేశారు. భారీ సంఖ్యలో హాజరైన భక్తులు కనులారా స్వామి వారి కల్యాణం తిలకించారు. అనంతరం 12.20కు ప్రత్యేక హోమం, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటలకు కల్యాణ మూర్తులతో గ్రామంలో భారీ ఊరేగింపు జరిగింది. ఊరేగింపు మెయిన్ రోడ్డు మీదుగా సాగి, రాత్రి 7 గంటలకు ఆలయానికి చేరుకుంది. అనంతరం స్వామి, అమ్మవార్లకు శ్రీ పుష్పయాగం నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్, మాజీ సర్పంచ్ వల్లు సత్యనారాయణ, సర్పంచ్ వల్లు వెంకటరమణ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.


పుట్టకొండలో కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకుడు

రోడ్డుపై చేరిన మురుగు నీరు

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట గ్రామ పంచాయతీ పరిధిలో సోమాలమ్మ గుడి వీధిలో డ్రైనేజీ పొంగడంతో రోడ్డుపైకి మురుగునీరు చేరింది. రోడ్డుపై వేసిన కల్వర్టు చెత్తతో మూసుకుపోవడంతో మురుగునీరు ముందుకు పారడం లేదు. దీంతో మురుగు నీరు రోడ్డుపైకి వచ్చి చేరుతోంది. స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.


సోమాలమ్మ గుడి వీధిలో రోడ్డుపై ఉన్న మురుగు నీరు

కంబాల చెరువు పార్క్‌లో దుర్గంధం


కంబాల చెరువులో మృతి చెందిన చేపలు

- చేపలు కుళ్లినా పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న సందర్శకులు

రాజమహేంద్రవరం సిటీ: ఆహ్లాదకరమైన కంబాల చెరువు పార్క్‌లో దుర్గంధం వెదజల్లుతున్నా నగరపాలక సంస్థ అధికారులు చర్యలు చేపట్టడం లేదని సందర్శకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోట్లాది రూపాయల వ్యయంతో నగర ప్రజలకు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని పంచేందుకు సిద్ధం చేసిన కంబాలచెరువు పార్కులో ఉన్న చెరువులో చేపలు మృతి చెంది, దుర్వాసన వెదజల్లుతోంది. దీనిపై నగరపాలక సంస్థ అధికారులు ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదని సందర్శకులు మండిపడుతున్నారు. కంబాల చెరువులో వందలాది చేపలు మృతి చెంది, కుళ్లిపోయి, దుర్గంధం వెదజల్లుతోంది. ఆదివారం పార్కుకు వచ్చిన సందర్శకులు ఈ పరిస్థితిపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అద్భుతంగా తయారు చేశామని చెప్పే అధికారులు ఈ విధమైన దుర్గంధంలో సందర్శకులు ఇబ్బందులు పడుతున్నా చర్యలు చేపట్టడం లేదని వాపోతున్నారు. నగరపాలక సంస్థ అధికారులు తక్షణమే స్పందించి, చెరువులో మృతి చెందిన చేపలను తొలగించే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కంబాల చెరువు పార్క్‌లో పారిశుద్ధ్య సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి నెలకొందని, దీనిపై నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సందర్శకులు కోరుతున్నారు.